ల్యూసిడా రైటింగ్ శిక్షణ ప్రారంభం



విద్యార్థులకు ల్యూసిడా రైటింగ్ శిక్షణ ఇస్తున్న వంపు మల్లయ్య

జగద్గిరిగుట్ట: జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత ల్యూసిడా రైటింగ్ శిక్షణను బుధవారం ప్రారంభించారు. ఈ రైటింగ్‌లో ఎంతో ప్రావీణ్యం ఉన్న క్యాలిగ్రఫీ, హ్యాండ్ ట్రైనర్ వంపు మల్లయ్య శ్రీనివాస్ నగర్, ఎన్‌టీఆర్ నగర్ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ వారం రోజులు కొనసాగుతుందని, త్వరలోనే ప్రభుత్వ పాఠశాలలో కూడా శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు.

వసతులు కల్పించాలని వినతి



మేయర్ నీలారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నిజాంపేట్: పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కార్పొరేషన్ మేయర్ నీలారెడ్డికి నిజాంపేట్ జడ్పీహెచ్ ఉపాధ్యాయులు బుధవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో అదనపు గదులు, విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు తదితర సదుపాయాలను కల్పించాలని కోరారు. మేయర్ సానుకూలంగా స్పందించారని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, రామచందర్ పాల్గొన్నారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు



అల్విన్‌కాలనీ: సుప్రీంకోర్టు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ ఇవ్వటంపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు, పోస్టులు పెట్టి కించపరుస్తున్నారంటూ బీఆర్‌ఎస్ మహిళా కార్పొరేటర్‌లు మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ఈ సందర్భంగా కంప్లయింట్ ఫిర్యాదు ప్రతిని చూపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

జగద్గిరిగుట్ట: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మల్లారెడ్డి నగర్ ప్రాంతంలోని ప్లాట్ నెంబర్ 240లో పేకాడుతున్నారన్న సమాచారంతో పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేశారు. ఏ1 దంపనబోయిన శ్రీనివాస్, ఏ2 మైల యాదగిరిరెడ్డి, ఏ3 పిట్టం లక్ష్మారెడ్డి, ఏ4 బద్దం నారాయణరెడ్డి, ఏ5 వాసుదేవ రావులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 10 పేకాట సెట్లు, 5 ఫోన్లు, రూ.67,550 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గృహిణి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దూలపల్లి మహాలక్ష్మి ఎన్‌క్లేవ్‌లో నివాసముండే రాకేష్, లావణ్య(30) భార్యాభర్తలు. వీరికి ఒక పాప ఉన్నది. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండటంతో లావణ్య మానసికంగా కృంగి పోయింది. ఈ నెల 27న ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో మధ్యాహ్నం బెడ్‌రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరమ్మతులకు మోక్షమెప్పుడో?

● గుంతల రోడ్లతో ప్రయాణికుల నరకం ● ప్రమాదకరంగా గుంతలు ● పట్టించుకోని అధికారులు



బాచుపల్లి నుంచి నిజాంపేట్ వెళ్లే ప్రధాన రహదారి ఇలా..



ప్రగతినగర్ ప్రధాన రోడ్డుపై..

నెలలు గడుస్తున్న రోడ్ల మరమ్మతులకు మోక్షం లభించడం లేదు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రోడ్ల గుంతలమయంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గ్రామ పంచాయతీ నుంచి కార్పొరేషన్‌గా మారిన తరువాత అభివృద్ధిలో దూసుకుపోతుందని అధికారులు చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్ల మరమ్మతులను చేపట్టాలని కోరుతున్నారు.

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రధాన రోడ్లు అయిన ప్రగతినగర్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు, నిజాంపేట్ నుంచి బాచుపల్లి సిగ్నల్ వరకు, బాచుపల్లి సిగ్నల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్ల మీద ఎక్కడ చూసిన గుంతలే కనిపిస్తాయి. ప్రతి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతలు ఏర్పడితే వెంటనే స్పందించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలానికి ముందే అధికారులు రోడ్లకు మరమ్మతులు చేపట్టి ఉంటే వర్షాలు పడ్డప్పుడు రోడ్లు ఎక్కువగా గుంతలమయం అయ్యేవి కావు. ఇక బాచుపల్లి చౌరస్తాలో ఫ్లై ఓవర్ పనుల మూలంగా చౌరస్తాలో రోడ్లు చిత్తడి చిత్తడిగా మారడంతో వాహనదారులు పడుతున్న అవస్థలు అంతాఇంతా కాదు.

కాలనీల రోడ్లు అంతే..

ప్రధాన రోడ్ల దుస్థితి అలా ఉంటే బస్తీల్లో, కాలనీల్లో ఉన్న అంతర్గత రోడ్ల పరిస్థితి మరి అధ్వానంగా ఉంది. ఎక్కడ చూసిన గుంతలే. అభివృద్ధి పనుల మరమ్మతుల కోసం తవ్విన రోడ్లకు మరమ్మతులు చేయలేదు. వివిధ పనులు జరిగాక సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌లు రోడ్ల మరమ్మతులు చేపట్టలేదు. ఇక కేబుల్స్ వేయడానికి సైతం అక్కడక్కడ రోడ్లను తవ్వి వదిలేశారు. ఇక డ్రైనేజీ, మంజీరా పైపులైన్ పనుల కోసం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తవ్విన రోడ్లకు నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయడం లేదు. దీంతో వర్షాలు పడ్డప్పుడు కాలనీల్లో, బస్తీల్లో ఉన్న రోడ్లపై ఉన్న గుంతలు వర్షపు నీటితో ప్రమాదకరంగా మారాయి.



నిజాంపేట్ శ్రీరాం కుంట పక్కన ఉన్న రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హోల్

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

రోడ్లపై ఏర్పడిన గుంతల మూలంగా వాహనదారులు తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా బాధితులు అవుతున్నారు. వర్షం పడిందంటే గుంతల్లో వరద నీరు చేరి గుంతలు కనిపించకపోవడంతో వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. పాదచారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. అదే విధంగా గుంతల రోడ్లతో ట్రాఫిక్ జాం అవుతుందని వాహనదారులు వాపోతున్నారు. ఇకనైనా రోడ్ల మరమ్మతులను పూర్తి చేసి, వాహనాలు సాఫీగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీసీపీ సురేశ్‌కుమార్

నిజాంపేట్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ అన్నారు. రెండు రోజులుగా బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న డీసీపీ జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్ పోటీలో బాచుపల్లి టీమ్ ప్రథమ బహుమతి, అల్లాపూర్ టీమ్ ద్వితీయ బహుమతి, వివేకానంద(అల్లాపూర్) టీమ్ తృతీయ బహుమతి గెలుచుకుంది. విజేతలకు డీసీపీ సురేశ్ కుమార్ బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగంలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ జట్ల క్రీడాకారులు ఎంతో సమయస్ఫూర్తితో ప్రతిభ కనబరిచారన్నారు. వాలీబాల్ పోటీల నిర్వహణకు కృషి చేసిన బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్‌ను డీసీపీ అభినందించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రంలో అగ్ని ప్రమాదం



మూసాపేట: మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న మీ సేవ సెంటర్‌లో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. కంప్యూటర్, టేబుల్స్, కొన్ని దస్తావేజులు కాలిపోయాయి. రాత్రి 12 గంటల సమయంలో రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మంటలు వ్యాపించటంతో వాచ్‌మెన్ గమనించి కార్యాలయం సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయటంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ కార్యాలయంలో వరుసగా దస్తావేజు పత్రాల దుకాణాలు ఉంటాయి. మిగిలిన దుకాణాలకు మంటలు వ్యాపిస్తే నష్టం జరిగేది. అయితే ప్రతి రోజు కార్యాలయం బయట గ్రిల్స్ ఉంటాయి. ప్రతి రోజు తాళం వేసి వెళ్లేవారు. కాగా మంగళవారం తాళం వేయకపోవటంతో అగ్నిమాపక సిబ్బంది త్వరగా లోపలికి వెళ్లి మంటలను అదుపులోకి తేగలిగారు.

ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సంతోష్‌కుమార్

నిజాంపేట్: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాచుపల్లి సాయినగర్‌కు చెందిన గజ్జెల్లి సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఈ మేరకు నియామక పత్రాన్ని సంతోష్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు అన్ని వర్గాలతో కలిసి పని చేస్తానన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న సంతోష్‌కుమార్

ఆలయ ప్రథమ వార్షికోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజులోని విజయ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు హాజరయ్యారు. గణపతి హోమం, పాలాభిషేకం, పుష్పార్చన, శాంతి కల్యాణం నిర్వహించారు.

విద్యుత్ పోరాట అమరులకు ఘన నివాళి



విద్యుత్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

నిజాంపేట్: ప్రగతినగర్ ఎలిఫెంట్ సర్కిల్‌లో బుధవారం సీపీఎం బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకుడు బాల వెంకటేశ్వరరావు, మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యుడు వెంకట రామయ్య మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపే విధంగా ప్రపంచ బ్యాంకు విధానాలను అవలంభించిన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించాయన్నారు. సంస్కరణల పేరుతో విద్యుత్‌ను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించగా.. చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించామని, ఆ పోరాటంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి త్యాగాలు చిరస్మరణీయమన్నారు. వారి త్యాగాలు భవిష్యత్ పోరాటాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, వెంకటరాజం, కృష్ణయ్య, బాలపీరు, నారాయణ, మణి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో భాగస్వాములవ్వాలి



సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న జేకే శేఖర్ యాదవ్

సుభాష్ నగర్: సభ్యత్వ నమోదులో కార్యకర్తలు భాగస్వాములవ్వాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ అన్నారు. 130 డివిజన్ సుభాష్ నగర్‌లో అధ్యక్షుడు కంది శ్రీరాములు ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ డివిజన్‌లో 10 వేలకు తక్కువ కాకుండా సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్ వాసు, ఎస్సీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ , భీమ్ రాజు, దేవర రమేష్, విజయేంద్ర, దినేష్, వనమాల పాల్గొన్నారు.

నేడు సభ్యత్వ నమోదు రివ్యూ సమావేశం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ నరసింహ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు రివ్యూ సమావేశం ఉంటుందని కార్పొరేటర్ రావుల శేషగిరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే సమావేశానికి డివిజన్ పదాధికారులు, మోర్చా నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జేఎన్‌టీయూలో 'విచారణ కమిటీ' ఏర్పాటు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో గత మూడు రోజులుగా విద్యార్థుల నడుమ జరుగుతున్న వివాదాలు దాడుల వరకు వెళ్లటంతో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవి నరసింహారెడ్డి స్పందించారు. బుధవారం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సంబంధిత విభాగాల అధిపతులతో విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. వివాదాలకు గల కారణాలను తెలుసుకోవడానికి సీసీ పుటేజీలను పరిశీలించారు. హాస్టళ్లలో తిష్టవేసిన బయటి వ్యక్తులను గుర్తించి మూడు రోజులలోపు నివేదిక ఇవ్వాలని ప్రిన్సిపాల్ కమిటీ సభ్యులకు సూచించారు.

హాస్టల్ గదుల సమస్య లేదు...

వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపడా గదులు లేవనడంలో వాస్తవం లేదని, మిగిలిన యూనివర్సిటీలతో పోల్చితే జేఎన్‌టీయూ హాస్టల్స్‌లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని ప్రిన్సిపాల్ 'సాక్షి'కి తెలిపారు. విద్యార్థుల నడుమ రేగిన వివాదం తెలుసుకొని సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.



వసంత విహార్ కాలనీలో రోడ్ల పక్కన వేసిన భవన నిర్మాణ వ్యర్థాలు, చెట్ల కొమ్మలు

ఎక్కడ చూసినా నిర్మాణ వ్యర్థాలే..

పట్టించుకోని అధికారులు

కుత్బుల్లాపూర్: కాలనీలోని ఏ రోడ్డు చూసినా నిర్మాణ వ్యర్థాలు, చెట్ల కొమ్మలే దర్శనమిస్తున్నాయి. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీడిమెట్ల డివిజన్ వసంత విహార్ కాలనీలోని రోడ్ల పక్కన భవన నిర్మాణ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఈ విషయమై కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పలుమార్లు సర్కిల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన కరువైంది. అదే విధంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు విరిగిపడిన చెట్ల కొమ్మలను సైతం అలాగే వదిలేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణ వ్యర్థాలను తరలించే ఏర్పాట్లు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



డెంగీ.. డేంజర్ బెల్స్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో 394 డెంగీ కేసులు

- 30 రోజుల వ్యవధిలో బస్తీ, పట్టణాల్లో 232 కేసులు
- ఫీవర్ సర్వేలో వైద్యశాఖ గుర్తించిన జ్వర పీడితులు 8,742 మంది



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో డెంగీ డేంజర్ బెల్ మోగిస్తోంది. జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లు, పురపాలక సంఘాలు, బస్తీల్లో దోమల బాధలు భరించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగర శివారుల్లో చాపకింద నీరులా డెంగీ విజృంభిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 394 డెంగీ కేసులు నమోదు కాగా, టైఫాయిడ్, చికెన్ గున్యా, విషజ్వరాలకు సంబంధించిన కేసులు స్వల్పంగా నమోదయ్యాయి. వర్షాలతో దోమలు విజృంభిస్తుండటంతో డెంగీ కేసులు పెరుగుతున్నట్లు పేర్కొంటున్నారు. పల్లెల్లో మాత్రం విషజ్వరాలు, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు వంటి జబ్బులు పెరుగుతున్నాయి. బస్తీలు, పురపాలికలు, పల్లెల్లో బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు లభించకపోవడంతో నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు పరిగెడుతున్నారు. పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దీంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. జిల్లాలో జులై చివరి వారం నుంచి ఇప్పటి వరకు 232 డెంగ్యూ కేసులు నమోదు కావడంతో.. ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మేడ్చల్ మండలం రావల్‌కోల్‌లో 40 రోజుల కిందట ఒక వ్యక్తి డెంగ్యూతో మృతి చెందడంతో పల్లెల్లో దోమల నివారణ, పరిశుభ్రతపై జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది.

జ్వర పీడితులు 8,742 మంది..

మేడ్చల్ జిల్లాలో 15 మండలాల పరిధిలో జులై 5 నుంచి బుధవారం వరకు ఇంటింటి ఫీవర్ సర్వేలో భాగంగా 3,71,514 ఇళ్లను విజిట్ చేసిన వైద్య సిబ్బంది.. ఇందులో 13,37,450 మంది నుంచి రోగ నిర్ధారణ వివరాలు సేకరించారు. ఈ నేపథ్యంలోనే 8,742 మంది ప్రజలు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించటంతో పాటు వారికి మందులు(మెడిసిన్) అందజేశారు. ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ సిబ్బంది వ్యాధుల కారకాలైన దోమలు, అపరిశుభ్రత, ఆహారం, పరిసరాల పరిశుభ్రత, నీటి శుభ్రతపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

వాతావరణ మార్పులతో..

ఒక రోజులోనే ఎండ కాయడం, కొన్ని గంటలకు వర్షం కురవడం, మరికాసేపటికే చల్లని గాలులు వీయడం వంటివి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒంట్లో రోగ నిరోధకశక్తి తక్కువ ఉన్న వారు త్వరగా వ్యాధుల బారిన పడుతున్నారు. నిత్యం పోషకాహారం తీసుకుంటూ సరైన శారీరక వ్యాయామం చేసే వారు మాత్రం వీటిని ఎదుర్కొంటున్నారు. వ్యాధి బారిన పడిన వారిలో సగం మంది జ్వరం, గొంతు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు.

దోమల నియంత్రణపై..

జిల్లావ్యాప్తంగా వర్షాలు కురవడంతో బస్తీ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల వర్షపు నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారింది. దోమల నియంత్రణకు ఫాగింగ్ వంటి చర్యలతో పాటు వైద్య ఆరోగ్యశాఖ పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

అత్యధిక కేసులు ఇక్కడే..

జీహెచ్‌ఎంసీ సర్కిళ్లు, పురపాలక సంఘాల్లో అత్యధిక డెంగీ కేసులు నమోదవుతున్నాయి. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎక్కువగా డెంగీ కేసులు నమోదయ్యాయి. వైరల్ ఫీవర్ వంటి రోగాలు తీవ్రంగా ప్రబలుతుండటంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో చిన్న, పెద్ద పరిశ్రమలతో పాటు ఉపాధి మెండుగా ఉండటంతో వలస ప్రజలు కూడా అధికంగా నివస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేట్ ఆస్పత్రులు పరీక్షలు, వైద్య సేవల పేరుతో అందినకాడికి దోచుకుంటున్నాయి.

వ్యాధులు ప్రబలేందుకు..

జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతం ఉండటంతో పాటు కూకట్‌పల్లి, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లలో బస్తీలతో పాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడ్చల్ మున్సిపల్ పట్టణాల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యం, చెత్తాచెదారంతో దోమలు స్వైర్యవిహారం చేస్తున్నాయి. వాటి నివారణకు ఫాగింగ్ యంత్రాలతో పొగ వెదజల్లక పోవడంతో ప్రజలు రోగాలకు గురవుతున్నారు. పురపాలికల్లో అభివృద్ధి పర్యవేక్షణ కమిషనర్లదే అయినా పట్టించుకోవడం లేదు. గ్రామీకవాడల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యం, కాలుష్యం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దు



జిల్లాలో జ్వరాలకు సంబంధించిన మందులు అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. జ్వరం వచ్చినట్లు అనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందాలి. అవసరమైతే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, టైఫాయిడ్ పరీక్షలు ఉచితంగా చేస్తారు. జ్వరమే కదా అని ఇంట్లో కూర్చుంటే ప్రాణాల మీదకు వచ్చే ప్రమాదం ఉంది. ఆస్పత్రికి ఎంత త్వరగా వెళ్తే అంత మంచిది. ఫీవర్ సర్వేలో జ్వర పీడితులను గుర్తించి మందులు పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్ రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్‌ఓ, మేడ్చల్ జిల్లా